

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 171 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 22, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్








డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# పేదలంటే.. ఎందుకింత చులకన !


**ఫోన్ లు ఎత్తని ప్రభుత్వ అధికారులు**
**పేదలపై ప్రభుత్వ అధికారుల పట్టింపు ఎక్కడ**
**ప్రభుత్వ అధికారులు జీతం తీసుకునేదే పేదలకు సేవ చేయడానికి**
**ప్రజాసేవను మర్చిపోయి ఏసీల చల్లదనానికి అలవాటు పడుతున్నారు**
**పేద ప్రజలు డబ్బులు ఇవ్వలేరనే దూరం పెడుతున్నారు**
**ప్రభుత్వ అధికారుల అధికార హోదాలు ఎంతో మొద్దుబారి పోతున్నాయి**
**ప్రభుత్వ అధికారిక ఫోన్లు చాలా చోట్ల పని చేయడం లేదు**
**కావలసినన్ని మోసాలతో కదం తొక్కుతున్న అధికారులు**
**అధికారుల ఆగడాలను ప్రజలందరూ ప్రశ్నించాలి**
**హోదాకు తగ్గ పనులు చేయని అధికారులను శిక్షించాలి**
**ఏ ప్రభుత్వ కార్యాలయంలో చూసిన ఇదే రహస్య దందా నడుస్తుంది : డాక్టర్ బరిగెల శివ**


హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

పేద ప్రజల సేవలకు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నట్లుగా ప్రభుత్వ ఉన్నత అధికారులు ప్రజా సమస్యల పట్ల వస్తున్నటువంటి ఫోన్లకు సమాధానం చెప్పకుండా ఫోన్లు ఎత్తడం లేదంటూ తీవ్రంగా విమర్శించారు. ప్రతి ప్రభుత్వా అధికారి నెలవారి జీతంగా ప్రజలు చెల్లిస్తున్న పన్నుల రూపంలోని డబ్బును జీతాలుగా స్వీకరిస్తూ పన్నుల రూపంలో జీతాలు చెల్లిస్తున్న ప్రజలను తీవ్రంగా మానసిక వేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి అధికారికి ప్రభుత్వం తరపున అధికారికంగా మొబైల్ సిమ్ములు అందించబడి ఉండగా లెక్కలేనన్నిచోట్ల వాటిని వాడకంలో మానేసి ప్రైవేట్ సిమ్ములతో ప్రైవేట్ నెంబర్లతో చలామణి

- మిగతా 2లో..








## “నాకు నా రాజీవ్‌ను తిరిగి ఇవ్వండి...”

ఒక భార్య ఆవేదన,ఒక దేశం మరువలేని ప్రేమగాథ

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సోనియా గాంధీ మనసులోని మౌన వేదన మరోసారి గుర్తు చేస్తున్న చరిత్ర

ఫౌండర్ & చైర్మన్,
జై భీమ్ టీవీ డా. బరిగెల శివ

2



## మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయం చేస్తే సహించం: రేవంత్ రెడ్డి

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన రేవంత్ రెడ్డి
స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికింది రాజీవ్ అని కితాబు
సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య



6

## రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..

6

ఎన్నాళ్లీ మొద్దు నిద్ర అని ప్రశ్న!

## తెలంగాణలో కార్మికులకు శుభవార్త

జూన్ 1 నుంచి కనీస వేతనాల పెంపు - సీఎం రేవంత్ రెడ్డి

2






## గుజరాత్ దెబ్బకు చెన్నై కథ సమాప్తం

ఐపీఎల్-2026 నుంచి సీఎస్కే ఔట్
చెన్నైపై 89 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం
ఈ ఓటమితో ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన సీఎస్‌కే
గిల్, సాయి సుదర్శన్, బట్లర్ అర్ధశతకాలతో గుజరాత్ భారీ స్కోరు
లక్ష్య ఛేదనలో 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై సూపర్ కింగ్స్
బౌలింగ్‌లో సిరాజ్, రబాడ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో చెలరేగారు


6

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# “నాకు నా రాజీవ్‌ను తిరిగి ఇవ్వండి...”

**ఒక భార్య ఆవేదన,ఒక దేశం మరువలేని ప్రేమగాథ**
**రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సోనియా గాంధీ మనసులోని మౌన వేదన**
**మరోసారి గుర్తు చేస్తున్న చరిత్ర**
**ఫౌండర్ & చైర్మన్, జై భీమ్ టీవీ డా. బరిగెల శివ**

**న్యూఢిల్లీ,మే 21 (జై భీమ్ న్యూస్)**



“నాకు నా రాజీవ్‌ను తిరిగి ఇవ్వండి... నేను తిరిగి వెళ్లిపోతాను. తిరిగి ఇవ్వలేకపోతే, ఆయన కలిసిపోయిన ఈ మట్టిలోనే నన్ను కూడా కలిసిపోనివ్వండి...” ఈ మాటలు కేవలం ఒక రాజకీయ నాయకురాలి మాటలు కావు. తన జీవితాన్ని అంకితం చేసిన భర్తను కోల్పోయిన ఒక భార్య గుండె లోతుల్లోంచి వచ్చిన ఆవేదన. ఇటలీలో జన్మించిన సోనియా అనే యువతి, చదువుకునే రోజుల్లో రాజీవ్ గాంధీని మొదటిసారి చూసింది. ఆ చిరునవ్వు, ఆ వ్యక్తిత్వం, ఆ సరళత ఆమెను ఆకర్షించాయి. ఆ పరిచయం ప్రేమగా మారింది. ప్రేమ జీవిత బంధంగా మారింది. భారతదేశం అనే అపరిచిత దేశం, రాజీవ్ ప్రేమ కారణంగా ఆమెకు సొంతిల్లు అయింది. పెళ్లి తర్వాత ఎంతో ఆనందంగా సాగుతున్న వారి జీవితంలో అనుకోని విషాదాలు వరుసగా చోటు చేసుకున్నాయి. సంజయ్ గాంధీ మరణం తర్వాత కుటుంబానికి అండగా నిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశం కోసం, తల్లి కోసం రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. సోనియాకు అది ఇష్టం లేకపోయినా, భర్త నిర్ణయానికి అండగా నిలిచారు. 1984లో దేశాన్ని కుదిపేసిన ఘటన జరిగింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హత్యకు గురయ్యారు. తన కళ్లముందే రక్తపు మడుగులో పడిపోయిన అత్తను చూసిన సోనియా గాంధీ ఆ క్షణాన్ని జీవితాంతం మరచిపోలేకపోయారు. ఆ బాధ నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో దారుణం జరిగింది. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో రాజీవ్ గాంధీ ప్రాణాలు కోల్పోయారు. ఒకప్పుడు చిరునవ్వులతో కనిపించిన భర్త, మృతదేహంగా ఇంటికి రావడం సోనియా గాంధీ జీవితాన్ని శాశ్వతంగా మార్చేసింది. భర్తను కోల్పోయిన బాధ ఒకవైపు, రాజకీయ విమర్శలు మరోవైపు. విదేశీయురాలు అని, ఎన్నో అవమానకర వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, రాజకీయ దాడులు ఎదురైనా ఆమె వెనక్కి తగ్గలేదు. రాజీవ్ గాంధీ కలలు కన్న భారతదేశం కోసం తన బాధ్యతను నిర్వర్తిస్తూ ముందుకు సాగారు. సోనియా గాంధీ జీవిత కథ రాజకీయాలకు అతీతంగా చూస్తే, అది ప్రేమ, త్యాగం, బాధ, సహనం, ఆత్మస్థైర్యానికి ప్రతీకగా నిలుస్తుంది. భర్తను కోల్పోయినా ఆయన జ్ఞాపకాలను, ఆయన ఆశయాలను కాపాడేందుకు ఆమె చేసిన ప్రయాణం భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోతుంది. ఈరోజు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా దేశం ఆయన సేవలను స్మరించుకుంటున్న వేళ, ఒక భార్య తన భర్త కోసం వ్యక్తం చేసిన ఆవేదన కూడా కోట్లాది హృదయాలను కదిలిస్తోంది. “అధికారాలు శాశ్వతం కావు... పదవులు శాశ్వతం కావు... కానీ ప్రేమించిన వ్యక్తి జ్ఞాపకం మాత్రం శాశ్వతం.” రాజీవ్ గాంధీ అమర్ రహే...!

# రాష్ట్ర స్థాయి జీవ వైవిధ్య సదస్సుకు కేయూ ఇంజినీరింగ్ విద్యార్థుల ఎంపిక







**కేయూ క్యాంపస్ / జై భీమ్ న్యూస్ :**

తెలంగాణ జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “రాష్ట్ర స్థాయి జీవ వైవిధ్య సదస్సు (స్టేట్ లెవెల్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్--2026)”కు కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని కేయూ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (కో-ఎడ్యుకేషన్) విద్యార్థులు ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఖాజా హనీఫ్ ఉల్ అబిదీన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి. సాయికుందన్, అలాగే ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థి ఎస్. శివనంద రెడ్డి ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు ఎంపికైనట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. “అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం--2026” సందర్భంగా మే 21, 22 తేదీలలో హైదరాబాద్‌లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో ఈ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించబడనుంది. జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, ప్రకృతి వనరుల సంరక్షణ వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, నిపుణులు, శాస్త్రవేత్తలు ఈ సమావేశంలో చర్చించనున్నారు. సదస్సులో పాల్గొనేందుకు ఎంపికైన విద్యార్థులు బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు. విద్యార్థుల ఎంపికపై కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వరంగల్ కమిషనరేట్‌లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**వరంగల్, మే 21 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా వరంగల్ కమిషనరేట్‌కు కొత్తగా నియమితులైన కె. కుమార్ స్వామిని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు నియమించారు. వీఆర్‌లో ఉన్న బండారి రాజును టాస్క్‌ఫోర్స్ విభాగానికి బదిలీ చేయగా, హరికృష్ణను సీసీఎస్ విభాగానికి బదిలీ చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. పోలీస్ శాఖలో పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు సమాచారం.

# “పేదలంటే “ఎందుకింత “చులకన”

మొదటి పేజీ తరువాయి

చేస్తుండడం ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు ఏమాత్రం సమాచారం లేకుండా పోతుందని గుర్తు చేశారు.ప్రజాసేవ పట్ల ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియపరచబడే విధంగా అధికార కార్యాలయాలు చేపడుతున్నటువంటి అభివృద్ధిని ప్రజలందరికీ తెలిసే విధంగా పలు విధాల జాగ్రత్తలు పాటించాలిగానీ అంతర్గతంగా రహస్యమైన పద్ధతిలో ప్రభుత్వ పనులు చేస్తున్న అధికారుల మొండి వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అధికారులందరూ పేలవమైన సేవలు అందిస్తున్నారని ప్రజలను పట్టించుకోవడం లేదంటూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా జోరుగా ప్రచారం నడుస్తుందని తెలిపారు.ప్రభుత్వ అధికారుల అసమర్థత వల్లే పేద ప్రజల జీవితాలు అణగారి పోతున్నాయని అన్నారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజాసేవ కోసం పరితపిస్తున్నట్లుగా నోటీస్ బోర్డులు పెడుతూ ప్రజలను ఆదుకుంటామని మభ్యపెడుతుండడం విచారకరం అన్నారు.ప్రజలకు న్యాయబద్ధంగా జరగాల్సిన పనుల్లో కూడా తీవ్రమైన జాప్యం చేస్తూ ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారం పట్ల కాలయాపన చేస్తూ అల్ప సంతోషాన్ని అల్ప ఆనందాన్ని పొందుతూ ప్రజల్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చుట్టు తిప్పుకుంటూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.పేద ప్రజల తరపున సమస్యల పరిష్కారం కొరకు ప్రశ్నిస్తున్న వ్యక్తులపై ప్రజాసంఘాలపై విద్యార్థి నేతలపై జర్నలిస్టులపై ఉద్యోగ సంఘాల నేతలు విరుచుకుపడుతూ అధికార పదవులను అధికార హోదాలను అడ్డం పెట్టుకొని వాళ్లపై కేసులు పెడతామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగుతుండడం భరించరాన్ని నేరంలాగా భావించాలన్నారు.ప్రజలను విసిగిస్తూ ప్రభుత్వ అధికారులు ఆనంద పడుతున్నారని అలాంటి ప్రభుత్వ అధికారులు రెప్పపాటులో అవినీతి నిరోధక శాఖలకు చిక్కుతూ తగిన మూల్యం చెల్లించుకుంటున్నారని గుర్తు చేశారు.ప్రభుత్వం తరపున బాధ్యత వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులంతా ప్రజలకు తగిన విధంగా సేవలు చేయాలని ప్రభుత్వాధికారులకు పలుమార్లు హెచ్చరిస్తున్నప్పుడికిని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులుగా కొనసాగుతున్న వ్యక్తులందరూ డబ్బు సంపాదనకు మరిగి ప్రజాసేవను విడమరుస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.ప్రజలకు మేలు చేయడం వల్ల అధికారులకు ఒరిగే లాభం ఏమీ లేదని గుర్తించి ఎవరైతే డబ్బులు పెట్టుకొని పనులు చేసుకుంటారో అలాంటి వాళ్ల పనులపై ఎక్కువ ఆసక్తిని చూపుతూ డబ్బు సంపాదన కోసం ఎంతకైనా దిగజారి పనులు చేస్తున్నారని ప్రభుత్వ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు.కొంతమంది అధికారులు ప్రజాసేవకు కట్టుబడి ఎదురొడ్డి పని చేస్తున్నారని అలాంటి అధికారులను ప్రజలందరూ తగిన విధంగా గౌరవించుకొని తీరాలని చించారు.

**బీద ప్రజల్ని బాధ పెడుతున్నారు..**

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏ చిన్న పని జరగాలన్న రాజకీయ పైరవీలు తప్పనిసరి అనే కోణంలో అధికారుల స్వభావం ఉంటుండగా బీద ప్రజలు రాజకీయ పైరవీలు చేసుకొనే స్తోమత లేక చతికిల పడిపోతున్నారని వాపోయారు.రాజకీయా నాయకులతో సన్నిహిత సంబంధం కలిగిన అధికారులందరూ ప్రజాసేవకు విఘాతం కలిగిస్తున్నారని ప్రజలకు సేవ చేసిన సేవ చేయకపోయినా వాళ్లను ఎవరు అడగలేరనే దీమాతో బీద ప్రజల్ని బాధపెడుతూ అధికార హోదాకు చెందిన మరో రకమైన కోణాన్ని బయటపెడుతున్నారని తెలిపారు.తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులంతా తీరికపాటి సమయం లేకుండా ప్రజల కోసం పనిచేస్తున్నామని చెప్పుకుంటూ ప్రజా సేవకు తీవ్రమైన అడ్డంకులు కల్పిస్తున్నారని విమర్శించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో నైపుణ్యత కలిగిన అధికారులు మాత్రమే ప్రతి ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఇటు ప్రభుత్వ కార్యాలయాలను కాపాడుకోవడంతోపాటు బీద ప్రజలకు తగినంత సేవ చేయడం కోసం స్థాయిని మించి కృషి చేస్తున్నారని వాళ్లంతా బీద ప్రజలకు బాంధవుల్లాగా సహాయతున్నారని అభినందించారు.అదే సందర్భంలో అనాలోచిత నిర్ణయాలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అమలు పరచడం కోసం ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకుల పలుకుబడిని వాడుకుంటున్నారని నిజాయితీగా బీద ప్రజలకు లబ్ధి చేకూర్చబడే ప్రతి సందర్భంలో అధికారుల వ్యక్తిగత స్వభావం వీర ప్రజలకు అనుకున్న విధంగా ఉండకపోగా చాలా సందర్భాల్లో ప్రజలకు వ్యతిరేకమైన పనులు చేయాల్సిన పరిస్థితుల్లో అధికారుల స్వభావం అంతుచిక్కని విధంగా ఉండటం సహజంగా అనిపిస్తుందని హెచ్చరించారు.

**అధికారుల ఫోన్లకు ఏమైంది..**

దీర్ఘకాలిక సమస్యలపై స్పందించన అధికారులను శిక్షించాలి పేర్కొన్నారు.సమస్యల పరిష్కార మార్గాన్ని చూపకుండా తీవ్రమైన జాప్యం చేస్తున్న ప్రభుత్వ అధికారుల మొండి వైఖరి నశించాలని కోరారు.చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యలపై వస్తున్న ఫోన్లకు అధికారులు అధికారులు సమాధానం దాటవేస్తు ఫోన్లు ఎత్తకపోవడం ప్రజాసేవపై పగరాజేయడమేనంటూ గుర్తు చేశారు.ప్రతి చిన్న సమస్య పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ సాధారణ ప్రజలను తిప్పుకుంటుండగా వాటిని పసిగడుతూ మొట్టమొదట స్పందించేది జర్నలిస్టులేనని ఏ ప్రభుత్వ అధికారైన జర్నలిస్టుల ఫోన్ ఎత్తకుండా ఆంక్షలు పెట్టుకున్నట్లుగా ప్రజాసేవలను విస్మరించడం అనేది ఏదైతే ఉందో అది స్పష్టంగా ప్రభుత్వ అధికారుల మొండి వైఖరిని తెలియజేస్తుందన్నారు. ఏ ప్రభుత్వ అధికారైతే ప్రజా సమస్యల పట్ల నిజాయితీ కలిగిన సమాధానాలు ఇస్తూ సమస్యల పరిష్కారం చూపిస్తున్నారో అలాంటి అధికారులు ఎలాంటి పొరపాట్లకు అవకాశాలు ఇవ్వరు అనేది స్పష్టంగా అర్థమవుతుందన్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రభుత్వ అధికారులు అధికారిక ప్రభుత్వ ఫోన్లను , సిమ్ముకార్డులను లను స్విచ్ ఆఫ్ చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ప్రభుత్వ అధికారులు ఫోన్లో ఎత్తకపోవడం గర్వంగా ఫీల్ అవుతున్నారని విమర్శిస్తూ ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేయాలని దృఢ సంకల్పం ప్రభుత్వ అధికారులకు లేకపోవడం వల్లనే చాలా మట్టుకు అధికారిక ఫోన్లను ఎత్తడం లేదు అంటూ హెచ్చరించారు.అధికార హోదాలను అంతుచిక్కని నిందల పాలు చేస్తున్న అధికారుల పట్ల ప్రభుత్వ వ్యవస్థలు, ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర పాలనంత ప్రజాపాలనగా కొనసాగుతూ రాష్ట్ర ప్రజలకు సకాలంలో మేలు చేయాలనే తపనతో ప్రభుత్వ ప్రణాళికలు సిద్ధపాటు చేయబడుతుండగా వాటన్నిటిని సకాలంలో అమలు పరచాల్సిన అధికారులు ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నట్లుగా వాళ్ల వాళ్ల అధికారిక హోదాలో అధికారులు చేస్తున్న పనులు ప్రజా వ్యతిరేకతను కూడబెడుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా ప్రభుత్వ అధికారుల అసమర్థతను, ఆగడాలను, అక్రమాలను, అవినీతిని, అసాంఘిక కార్యకలాపాలను ప్రజాసేవపై నిర్లక్ష్యాలను ప్రభుత్వ అధికార కార్యాలయాల దుర్వినియోగాలను ఎప్పటికప్పుడు సూటిగా ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై అవినీతి ఉద్యోగ గ్రూపులంతా అవినీతి అధికారులంతా ఏకమై యుద్ధానికి దిగుదామనే పద్ధతిలో తీవ్రమైన ఒత్తిళ్లకు గురిచేస్తూ కేసులు వేస్తామంటూ పోలీస్ అధికారులతో బెదిరింపులకు పాల్పడుతూ జర్నలిస్టులను వాళ్ల కుటుంబ సభ్యులను అదును కల్పించుకొని అదేపనిగా వేధిస్తున్నారని గుర్తు చేశారు.ఏ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారైన జర్నలిస్టులు రాస్తున్న వార్తలపై జర్నలిస్టులు ప్రశ్నిస్తున్న విధానంపై అనుమానాలు అభియోగాలు అవరోధాలు అపనమ్మకాలు ఉన్నట్లయితే తక్షణమే పత్రిక సమావేశం ఏర్పాటు చేసుకొని ఖండించాల్సిన బాధ్యత ఉంటుంది కానీ ప్రభుత్వ ఉద్యోగ అధికారులుగా ఉంటూ లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రభుత్వ ఉద్యోగ నియమాలకు సంబంధించిన వ్యతిరేక కార్యక్రమాలను చేపడుతూ ప్రశ్నిస్తున్న జర్నలిస్టులను పదేపదే బూతులు తిడుతూ పదేపదే బెదిరింపులకు పాల్పడుతూ పదేపదే కేసులు వేస్తామంటూ ప్రచారం చేస్తూ పదే పదే నిందలపాలు చేస్తూ కుటుంబ సభ్యులపై మహిళలపై ఉచ్చరింప శక్యంకానీ పదాలతో దూషిస్తూ తిడుతూ అపనిందలపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ నాయకులేమో వాళ్లకు అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే పైరవీలు చేస్తున్నారని సహాయపడుతున్నారని అందులో భాగంగా నిజమైన బీద ప్రజలకు సహాయం దొరకడం లేదంటూ ఆవేదన చెందారు.రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధుల ఫోన్లకు మాత్రమే సమాధానం చెబుతూ బీద ప్రజలకు సహాయపడతామని హామీలు ఇస్తూనే రెప్పపాటులో వాటిని పేడ చెవిన పెడుతూ అధికార కార్యక్రమాలను కొనసాగిస్తున్నామంటూ తీరికపాటి సమయం లేదంటూ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల తీవ్రమైన నిర్లక్ష్యపు ధోరణిని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో చూసిన అధికార హోదాకు సరితూగే విధంగా పనిచేస్తున్న వాళ్లు చాలా తక్కువగా కనిపిస్తున్నారు అంటూ గుర్తు చేసారు.కాలం చెల్లుబాటైన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికార కార్యాలయాల సిమ్ కార్డులను దగ్గర పెట్టుకొని అలాంటి సిమ్ములను ఉపయోగిస్తూ వ్యాపారాలు చేస్తున్నారని కాలం చెల్లుబాటైన నాయకులను పదవి విరమణ పొందిన అధికారుల దగ్గర ఉన్నటువంటి ప్రభుత్వ అధికారిక సిమ్ములను తక్షణమే తీసుకోవాలని గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా వైద్య శాఖలో ప్రజలకు ఉన్నటువంటి అనారోగ్య సమస్యల పట్ల ప్రభుత్వ అధికారుల ప్రభుత్వ వైద్యుల సేవలు పూర్తిగా నిలుపుదల చేయబడుతున్నాయని వాటిని ప్రభుత్వం ఉన్నపాటుగా గుర్తించాలన్నారు.పోలీస్ అధికారులైతే బీద ప్రజల ఫోన్లకు స్పందనేలేదంటూ తెలిపారు. ఏ ప్రభుత్వ శాఖలో చూసిన అధికారం అంతుచిక్కని అహంకారాన్ని తయారు చేసి పెడుతుందని ప్రజలను దగ్గర చేసుకోవడం కోసం కొంతమంది ప్రభుత్వాధికారులు చేపడుతున్న ప్రజాసేవ కార్యక్రమాలు వాళ్ళు పదవి విరమణ పొందిన తర్వాత కూడా సంవత్సరాల తరబడి ఆ కార్యాలయంలో వాళ్ల వాళ్ల గుర్తింపు అలాగే ఉండిపోతుందని ప్రజాసేవ పట్ల అంకితభావంతో పని చేయగలిగిన ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంత ఎక్కువ పెరిగితే ప్రజలకు అంత ఎక్కువ మేలు జరుగుతుందని దానికి భిన్నంగా ప్రజాసేవ పేరు చెప్పుకొని ప్రభుత్వ కార్యాలయాలను అంతమొందించే విధంగా పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులను గుర్తిస్తూ కాలానుకూలంగా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ అధికారి ప్రజాసేవ పట్ల నిజమైన మనస్తత్వం కలిగిన వారైతే ప్రజా సమస్యల పట్ల ఆయా కార్యాలయాలకు చేరవేయబడుతున్న ప్రతి సమాచారం పట్ల సరియైన రీతిలో స్పందిస్తూ ప్రభుత్వ అధికారిక ఫోన్లతో సమాధానాలు చరవేస్తారని వాళ్లకు నచ్చలేని పక్షంలో ముఖం చాటేస్తారని స్పష్టంగా తెలియజేశారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులకు, పనిచేయని అధికారులకు వాళ్ల వాళ్ల నిజాయితీకి మధ్య జరుగుతున్న ప్రజాసేవ పోరులో అధికార సమన్వయాన్ని పాటిస్తున్నారో, అధికార దుర్వినియోగాన్ని పాటిస్తున్నారో నిర్ధారించుకోవాల్సిన బాధ్యత వాళ్ళదేనని తెలిపారు.

# తెలంగాణలో కార్మికులకు శుభవార్త

**జూన్ 1 నుంచి కనీస వేతనాల పెంపు - సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ / జై భీమ్ న్యూస్ :**

తెలంగాణలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. పెంచిన కనీస వేతనాలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కార్మికులందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక ఉపాధి శిక్షణ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని కార్మికులను అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా నాలుగు కేటగిరీలుగా విభజించి వేతనాలను పెంచినట్లు తెలిపారు. గతంలో అర్బన్, రూరల్‌గా రెండు జోన్లు మాత్రమే ఉండేవని, ఇప్పుడు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలను పరిగణలోకి తీసుకుని మూడు జోన్లుగా విభజించి కనీస వేతనాలను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాలను రూ:12,750 నుంచి రూ:16 వేల వరకు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ:13,592 నుంచి రూ:17 వేల వరకు, స్కిల్డ్ కార్మికులకు రూ:13,772 నుంచి రూ:18,500 వరకు, హైలీ స్కిల్డ్ కార్మికులకు రూ:14,607 నుంచి రూ:20 వేల వరకు పెంచినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం కార్మికుల వేతనాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, దీని వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది కార్మికులు నష్టపోయారని సీఎం విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ అంశంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి సమగ్ర చర్చలు జరిపినట్లు తెలిపారు. కార్మిక సంఘాలు, నాయకులు, యాజమాన్యాలు, ఇతర స్టేక్‌హోల్డర్లతో సంప్రదింపులు జరిపి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఇంటి అద్దెల భారాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే ప్రపంచంలోని అనేక దేశాల్లో స్కిల్డ్ లేబర్ కొరత ఉందని, విదేశాలకు వెళ్లే కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఆయా దేశాల కంపెనీల అవసరాలకు అనుగుణంగా కార్మికులను పంపే ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం తెలిపారు. ముఖ్యంగా గల్ఫ్, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే కార్మికులు ఏజెంట్ల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం రక్షణగా ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన వారి మృతదేహాలను కూడా స్వదేశానికి తీసుకురావడం కష్టసాధ్యమైందని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలిచి రూ:5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి గుర్తుచేశారు. త్వరలోనే కార్మికుల సంక్షేమానికి మరిన్ని మంచి నిర్ణయాలతో ప్రభుత్వం ముందుకు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



# ట్రై సిటీ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు





**వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలించిన వరంగల్ సీపీ**

**ట్రైసిటీస్ / జై భీమ్ న్యూస్ :**

ట్రై సిటీ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించే దిశగా హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వాహన పార్కింగ్ కోసం అవసరమైన స్థలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులతో కలిసి హనుమకొండలోని అశోక జంక్షన్, హనుమకొండ చౌరస్తా, ఏనుగుల గడ్డ ప్రాంతాలను, అలాగే వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్, హెడ్ పోస్టాఫీస్ ప్రాంతాలను సీపీ సందర్శించారు. ఈ ప్రాంతాల్లో వాహన పార్కింగ్ ఏర్పాటుకు అవసరమైన స్థల విస్తీర్ణం, సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణాల్లో ఒకటి రోడ్లపై అనధికారిక పార్కింగ్ అని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్ ముందు వాహనాలను నిలిపివేయకుండా, భవనాల సెల్లార్లలోనే పార్కింగ్ చేసే విధంగా వ్యాపారస్తులకు ట్రాఫిక్ అధికారులు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఇలా చేయడం ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గి, కొంతవరకు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీపీ అభిప్రాయపడ్డారు. నగర ప్రజలకు సౌకర్యవంతమైన ట్రాఫిక్ వ్యవస్థను అందించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పరిశీలనలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా నేహ్రా, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, సుజాత, హనుమకొండ, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంట పొలాలకు నిప్పుతో జిల్లాలో వరుస అగ్నిప్రమాదాలు





**దగ్ధమైన గడ్డి లారీ.. పొగతో స్తంభించిన రాకపోకలు**
**రైతుల నిర్లక్ష్యంపై ఆందోళన.. వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

**హన్మకొండ, 21 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరి కోతలు పూర్తైన అనంతరం పంట అవశేషాలకు రైతులు నిప్పు పెడుతున్న ఘటనలు హనుమకొండ జిల్లాలో ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తున్నాయి. గురువారం కమలాపూర్ మండలం బాపూజీపేట రైల్వే ట్రాక్ సమీపం, ఎల్కతుర్తి మండలం అరేపల్లె, అంబాల ఎర్రగట్టు గుట్ట రోడ్డులో చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలు స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. మంటలు, దట్టమైన పొగలతో రహదారులపై రాకపోకలు స్తంభించిపోయాయి. కమలాపూర్ మండలం బాపూజీపేట వద్ద రైతులు వరి కొయ్యలు, పంట వ్యర్థాలకు నిప్పంటించడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. గాలివేగంతో మంటలు విస్తరించి సమీపంలోని జామాయిల్, ఇతర తోటలకు వ్యాపించాయి. ఇదే సమయంలో గడ్డి లోడుతో వెళ్తున్న ఓ లారీకి మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. లారీతో పాటు గడ్డి లోడు మొత్తం కాలిపోయింది.

అలాగే ఎల్కతుర్తి మండలం అరేపల్లె గ్రామంలో కూడా రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు పక్కనే ఉన్న పంట పొలాలకు వ్యాపించాయి. మంటలు ఎగసిపడుతూ కమలాపూర్ మండలంలోని శంభునిపల్లి గ్రామ పరిసరాలకు కూడా విస్తరించాయి. దీంతో గ్రామాలపై దట్టమైన పొగ అలుముకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా అంబాల ఎర్రగట్టు గుట్ట రోడ్డులో రైతులు పంట పొలాలకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ నడి రోడ్డుపై వ్యాపించింది. దాదాపు కిలోమీటర్ మేర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొగ కారణంగా వాహనదారులు ముందున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రమాద భయంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చినా సిబ్బంది సమయానికి చేరుకోలేదని ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామస్థులే స్వయంగా నీటి బిందెలు, చెట్ల కొమ్మలతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే అప్పటికే పెద్ద ఎత్తున పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. వ్యవసాయ నిపుణులు, స్థానిక ప్రజలు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా, అగ్నిప్రమాదాలు, వాయు కాలుష్యం, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో గాలివేగం అధికంగా ఉండటంతో చిన్న మంటలు కూడా భారీ అగ్నిప్రమాదాలకు దారితీస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ, అగ్నిమాపక శాఖ వెంటనే స్పందించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంట అవశేషాలను తగులబెట్టకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పంట పొలాలకు నిప్పు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.



# పంచాయతీరాజ్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ, మే 21 (జై భీమ్ న్యూస్)**



చాహత్ బాజ్‌పాయి జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన అంగన్వాడీ కేంద్రాల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, వీవో భవనాల నిర్మాణ పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చివరి దశలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, వీవో భవనాలను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా టెండర్లు పూర్తికాని పనుల విషయంలో వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్స్, టాయిలెట్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులను జూన్ 30లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కూడా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఈఈ సైదుల్ రెడ్డి, డీఈలు శ్రీనివాస్ రావు, జయశంకర్, శిరీష, శ్రీనివాస్ రెడ్డి, వివిధ మండలాల పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

## ఎండల నుంచి ఉపశమనం కోసం వరంగల్‌లో వినూత్న మిస్టింగ్ బస్ స్టాప్‌లు ప్రారంభం





**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**

ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో నగర ప్రజలకు ఉపశమనం కల్పించే దిశగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోనే వినూత్నంగా ఏర్పాటు చేసిన మిస్టింగ్ వాటర్ బస్ స్టాప్‌లను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ ప్రభుత్వ మెటర్నిటీ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో, పబ్లిక్ గార్డెన్స్ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన మిస్టింగ్ వాటర్ బస్ స్టేషన్‌లను వారు పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజా రవాణా వినియోగదారులకు తాత్కాలిక శీతల వాతావరణాన్ని కల్పించేందుకు ఈ ప్రత్యేక మిస్టింగ్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలు ప్రస్తుతం ప్రాంతీయ వాణిజ్య, వ్యాపార మరియు సేవా కేంద్రాలుగా అభివృద్ధి చెందాయని అన్నారు. పరిసర గ్రామీణ, ఉపనగర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ భారీ సంఖ్యలో ప్రజలు ఈ నగరాలకు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. వీరిలో అధిక శాతం మంది ప్రజలు బస్సులు, ఆటోలు వంటి ప్రజా రవాణా వ్యవస్థలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. ఉద్యోగాలు, విద్య, వైద్య సేవలు తదితర అవసరాల కోసం ప్రజలు అధికంగా బస్ సర్వీసులను వినియోగిస్తున్న నేపథ్యంలో బస్ స్టాప్‌లు, వేచి చూసే ప్రాంతాల్లో రోజువారీగా భారీ రద్దీ నెలకొంటోందన్నారు. ముఖ్యంగా పీక్ అవర్స్ సమయంలో ప్రయాణికులు తీవ్ర ఎండలో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మిస్టింగ్ బస్ స్టాప్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు మిస్టింగ్ వ్యవస్థలు సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధిక పీడన నాజిల్స్ ద్వారా విడుదలయ్యే సూక్ష్మ నీటి బిందువులు గాలిలో ఆవిరైపోతూ పరిసర ప్రాంత ఉష్ణోగ్రతను సుమారు 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గించగలవని వివరించారు. ఈ మిస్టింగ్ వ్యవస్థల ప్రధాన ఉద్దేశ్యం బస్ స్టాప్ పరిసర ప్రాంతంలో తాత్కాలికంగా చల్లని వాతావరణాన్ని సృష్టించి ప్రయాణికులకు సౌకర్యవంతమైన అనుభూతిని కల్పించడమేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, నాయకులు బిన్నీ లక్ష్మణ్, తోట పవన్, మనోహర్, ఉద్యానవన అధికారి రమేష్, ఈఈ రవి కుమార్, డిఈ రాజ్ కుమార్, ఏఈ హరి తదితర ప్రముఖులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో ప్రారంభమైన సరస్వతి నది అంత్య పుష్కరాలు

**త్రివేణి సంగమంలో తొలి పుష్కర స్నానం చేసిన శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ**



**భూపాలపల్లి జిల్లా/కాళేశ్వరం, 21 మే 2026 (జై భీమ్ న్యూస్)**

కాళేశ్వరంలో పవిత్ర సరస్వతీ నది అంత్య పుష్కరాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. త్రివేణి సంగమం వద్ద ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానం ఆచరించిన శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ పుష్కరాలను ప్రారంభించారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. త్రివేణి సంగమ తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామిజీతో పాటు మంత్రులు పుష్కర స్నానాలు ఆచరించారు. పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం భక్తులతో కిటకిటలాడుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. ఘాట్‌ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకోనున్నారు. గవర్నర్ తొలి రోజు పుష్కర స్నానం ఆచరించి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సరస్వతీ ఘాట్‌లో జరిగే గోదావరి హారతి, తెప్పోత్సవ కార్యక్రమాల్లో కూడా పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. సరస్వతీ పుష్కరాల సమయంలో పవిత్ర నదిలో స్నానం చేయడం వల్ల పుణ్యఫలాలు, శుభఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు.

# యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు అనుమతి లేదు : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ, 21 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో న్యూఢిల్లీకి చెందిన ప్రైవేట్ సెక్రటరీ శుభం గార్గ్‌తో కలిసి అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 4,075 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం 10 మంది లోకల్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 10 మంది సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన శుభం గార్గ్ సెంట్రల్ లెవెల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్‌గా, కే వరుణ్ రెడ్డి, ఐఏఎస్, సీఎండీ, టీజీఎన్‌పీడీసీఎల్ రాష్ట్ర స్థాయి అబ్జర్వర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తామని, అనంతరం ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు తీసుకురావద్దని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫోటో ఐడీ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 24న నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు హన్మకొండ జిల్లాలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సెయింట్ గాబ్రియేల్ హైస్కూల్, న్యూ సైన్స్ డిగ్రీ కాలేజ్, ఎస్సార్ నేషనల్ హైస్కూల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, లాల్ బహదూర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి రమేష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యాల్లో 109.76 శాతం సాధన





### డీసీసీ, డీఎల్ఆర్సీ సంయుక్త సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, మే 21 (జై భీమ్ న్యూస్)**

జిల్లా కలక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్సీ)ల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు జిల్లా కలెక్టర్ వి. గణేష్, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డీఆర్డీఓ నాగ పద్మజ, ప్రాంతీయ అధిపతి జి. కమలాకర్, ఆర్బీఐ ఎల్డీఓ శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హవేలి రాజుతో పాటు 33 బ్యాంకులకు చెందిన జిల్లా సమన్వయకర్తలు, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, స్వయం ఉపాధి పథకాలు, పీఎం ముద్ర, పీఎం సూర్య ఘర్ పథకం, మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల పంపిణీ పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి బ్యాంకు శాఖ పనితీరును మెరుగుపరుచుకోవాలని, అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి పంపిణీ చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యతా రంగంలో రూ.6,702 కోట్ల లక్ష్యానికి గాను బ్యాంకులు రూ.6,333 కోట్ల రుణాలను పంపిణీ చేసి 94.50 శాతం సాధించగా, ప్రాధాన్యతా రహిత రంగంలో రూ.2,572 కోట్ల లక్ష్యానికి గాను రూ.3,846 కోట్ల రుణాలను పంపిణీ చేసి 149.50 శాతం సాధించాయి. మొత్తంగా రూ.9,274 కోట్ల జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యానికి గాను రూ.10,179.37 కోట్ల రుణాలను పంపిణీ చేసి 109.76 శాతం సాధన నమోదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యా రుణాల పంపిణీ, ముఖ్యంగా బాలికలకు రుణాల మంజూరును మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. బలహీన వర్గాలకు రుణాల పంపిణీ, ప్రభుత్వం ప్రాయోజిత పథకాల అమలులో ప్రైవేట్ బ్యాంకులు మరింత చురుకుదనం చూపాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు, బలహీన వర్గాల కోసం ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించాలని, నిరుద్యోగ యువతకు వస్త్ర పరిశ్రమతో పాటు ఇతర జీవనోపాధి రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాలని బ్యాంకులకు సూచించారు. స్వయం సహాయక సంఘాల విభాగంలో 9,918 సంఘాలకు రూ.702 కోట్లు పంపిణీ చేయాలనే లక్ష్యానికి గాను 9,667 సంఘాలకు రూ.836 కోట్లు పంపిణీ చేసి 119 శాతం సాధన నమోదైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో సామాజిక భద్రతా పథకాల కింద యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మూడు క్లెయిమ్‌లు, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కింద రెండు క్లెయిమ్‌లకు సంబంధించి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అర్హులైన వారందరూ సామాజిక భద్రతా పథకాలలో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా 2026-27 సంవత్సరానికి సంబంధించిన నాబార్డ్ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌పీ)ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఇందులో ప్రాధాన్యతా రంగానికి రూ.8,648 కోట్ల కేటాయింపు ప్రతిపాదించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నరసింహమూర్తి, డీబీసీడీఓ పుష్పలత, మెప్మా డీఎంసీ రేణుక, డీఎంవోడబ్ల్యూఓ రమేష్, డీవీఏహెచ్‌వో బాలకృష్ణ, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎంజేపీ గురుకులాలకు బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలి

### 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్ కోచింగ్ అందించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్





**హైద్రాబాద్, 21 మే 2026(జై భీమ్ న్యూస్)**

పొన్నం ప్రభాకర్ గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాళ్లను అభినందించిన మంత్రి, తక్కువ ఫలితాలు సాధించిన విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎంజేపీ గురుకుల పాఠశాలలు అగ్రగామిగా నిలిచేలా అధ్యాపకులు సమిష్టిగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. విద్యార్థులకు పాఠ్యబోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ వంటి ఆధునిక అంశాల్లో కూడా ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. పదవ తరగతిలో 98.45 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 500కు పైగా మార్కులు 9,788 మంది విద్యార్థులు సాధించగా, 204 గురుకులాలు 100 శాతం ఫలితాలు నమోదు చేశాయని తెలిపారు. అయితే 65 పాఠశాలలు వెనుకబడి ఉన్నాయని, ఆయా సంస్థలు పనితీరును మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా తెలుగు సబ్జెక్టులో విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారని, ఆ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. 900కు పైగా మార్కులు 4,183 మంది విద్యార్థులు సాధించగా, 980కు పైగా మార్కులు 496 మంది సాధించినట్లు వెల్లడించారు. ప్రతి గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని, 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ర్యాంకర్ల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ఫలితాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గురుకులాల్లో విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, పెద్దలతో వ్యవహరించే తీరు, సమాజంలో ఎలా మెలగాలో బోధించాలని సూచించారు. ఎంజేపీ గురుకులాలకు ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని, ఇతర రాష్ట్రాల వారు కూడా తెలంగాణ గురుకుల విద్యావిధానాన్ని అధ్యయనం చేసే స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# ప్రజల్లో న్యాయంపై భరోసా కల్పించాలి : సీపీ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్, మే 21 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని పోలీస అధికారులకు సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. టాస్క్‌ఫోర్స్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బండారి రాజు, మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. స్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని తెలిపారు.



# రూ.42 వేల విలువైన నిషేధిత గుట్కా ఉత్పత్తుల స్వాధీనం

### ఇద్దరిపై కేసు నమోదు చేసిన హసన్‌పర్తి పోలీసులు

**వరంగల్, 21 మే 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**




హసన్‌పర్తి పోలీసులు భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న గుట్కా, పొగాకు ఉత్పత్తుల విలువ సుమారు రూ.42 వేలుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం ఉదయం ఎస్సై సుజిత్ రెడ్డి తన సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు అనంతసాగర్ శివారులోని ఆర్ఆర్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేపట్టగా, అక్కడ భారీ మొత్తంలో గుట్కా ఉత్పత్తులు లభించాయి. హోటల్ యజమాని తవటం శ్యాంబాబును విచారించగా, హనుమకొండకు చెందిన ఉమేష్ రాజ్‌పుత్ అనే వ్యక్తి ఈ పొగాకు ఉత్పత్తులను సరఫరా చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు వెంటనే హనుమకొండలోని ఉమేష్ రాజ్‌పుత్‌కు చెందిన హనుమాన్ కిరాణా జనరల్ స్టోర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడ కూడా భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించాయి. మొత్తం స్వాధీనం చేసుకున్న గుట్కా, పొగాకు ఉత్పత్తుల విలువ సుమారు రూ.42 వేలుగా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు హసన్‌పర్తి ఎస్‌హెచ్‌వో ఆకునూరి మహేందర్ తెలిపారు.

# చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

### నాన్ బెయిలబుల్ వారెంట్ అమలు చేసిన హసన్‌పర్తి పోలీసులు

**హసన్‌పర్తి, 21 మే 2026 (జై భీమ్ న్యూస్)**




హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో ప్రధాన నిందితుడిపై జారీ అయిన నాన్ బెయిలబుల్ వారెంట్‌ను పోలీసులు అమలు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, క్రైం నం.240/23, తేదీ 30-07-2023, సెక్షన్లు 454, 380 ఐపీసీ కింద నమోదైన కేసులో ప్రధాన నిందితుడైన బొండా రాంరెడ్డి (38), అనంతసాగర్ గ్రామం, హసన్‌పర్తి మండలానికి చెందిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేశారు. 2023 జూలై 29న అనంతసాగర్ గ్రామంలో జరిగిన చోరీ ఘటనలో నిందితుడు ఫిర్యాదుదారుడి ఇంటి నుంచి 1.75 తులాల నెక్లెస్, 11 గ్రాముల బంగారు బిస్కెట్, 25 తులాల బంగారం సహా మొత్తం రూ.1,85,000 విలువైన ఆభరణాలను దొంగిలించినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని 31-07-2023న అరెస్ట్ చేసి పరకాల జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అయితే అనంతరం కోర్టు విచారణలకు నిందితుడు నిరంతరం గైర్హాజరు కావడంతో గౌరవ న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని పరకాల ఉపజైలుకు తరలించారు.

# హనుమాన్ భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు : దాస్యం వినయ్ భాస్కర్





**వరంగల్, మే 21 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట మండలం న్యూశాయంపేటలో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం ను గురువారం దాస్యం వినయ్ భాస్కర్ దర్శించుకుని ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత ఆచారాలను, భక్తుల విశ్వాసాలను కించపరచొద్దని ప్రజాప్రతినిధులకు సూచించారు. న్యూశాయంపేటలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. హనుమాన్ మాలధారులు 41 రోజుల పాటు భక్తితో ఆంజనేయ స్వామిని కొలిచారని, అలాంటి భక్తులు ప్రతిష్ఠించిన హనుమాన్ విగ్రహాన్ని కూల్చివేయడం హనుమాన్ భక్తుల మనోభావాలపై దాడి చేసినట్టేనని అన్నారు. కూల్చివేసిన చోటే హనుమాన్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. దేవాలయ స్థలాన్ని కొందరు ప్రజాప్రతినిధులు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ప్రభుత్వంలో ఇదే స్థలంలో హనుమాన్ భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని మతాలు, అన్ని కులాల విశ్వాసాలను గౌరవించామని, హనుమకొండ పట్టణంలో ఏ ఒక్క చర్చ్, మసీదు, దేవాలయం, పాఠశాల జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కొందరు గుడులను కూల్చివేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఆంజనేయ స్వామివారి జోలికి వచ్చిన వారిని ఆ దేవుడే చూసుకుంటారని దాస్యం వినయ్ భాస్కర్ వ్యాఖ్యానించారు.

## నస్పూర్‌లో స్టేట్ వేర్ హౌస్ గోదాం పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 21 (జై భీమ్ న్యూస్)**

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కుమార్ దీపక్, జిల్లా మేనేజర్, నస్పూర్ మండల తహసీల్దార్ సంతోష్‌లతో కలిసి నస్పూర్ మండల కేంద్రంలోని స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం సక్రమంగా నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల మేరకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం నిల్వ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : ఎర్రబెల్లి దయాకర్ రావు



**హన్మకొండ, 21 మే 2026 (జై భీమ్ న్యూస్)**

బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లాలోని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కార్యాలయంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి కార్యకర్త తమ బాధ్యతగా గ్రామ గ్రామాన సభ్యత్వ నమోదు చేపట్టి ప్రజలను పార్టీతో అనుసంధానం చేయాలని కోరారు. బూత్ స్థాయి కోఆర్డినేటర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు కార్డు అందజేసి పార్టీలో గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, సుధీర్ కుమార్, నాగుర్ల వెంకన్న, వాసుదేవ రెడ్డి, సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీ డబ్బులు కాజేసి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు

**రూ.7.90 కోట్ల మోసం వెలుగులోకి**

**నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు : డీసీపీ శిరీష**





**హైద్రాబాద్, 21 మే 2026 (జై భీమ్ న్యూస్)**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలంలోని ఆర్.ఎం. కన్వర్టర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో భారీ ఆర్థిక మోసం వెలుగుచూసింది. కంపెనీ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న హనుమాన్ల లక్ష్మణ్ అనే ఉద్యోగి రూ.7 కోట్ల 90 లక్షల 27 వేల 915 రూపాయలను అక్రమంగా తన ఖాతాలోకి మళ్లించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ విషయాన్ని శిరీష గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గత ఆరు నెలలుగా పరిశ్రమకు చెందిన వెండర్లకు పంపించాల్సిన చెల్లింపులను హనుమాన్ల లక్ష్మణ్ తెలివిగా తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లిస్తున్నాడు. వెండర్ల పేర్లతోనే రికార్డులు నమోదు చేస్తూ డబ్బులను అక్రమంగా తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఇటీవల కంపెనీ డైరెక్టర్లు లెక్కలను పరిశీలించగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో లోతుగా తనిఖీ చేయగా భారీ మోసం జరిగిన విషయం బయటపడింది. వెంటనే కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టిన కొత్తూరు సీఐ నర్సయ్య మోసాన్ని వెలికితీశారు. నిందితుడి ఖాతా నుంచి రూ.1 కోటి 47 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అదనంగా రూ.2.60 లక్షల నగదు, రెండు స్మార్ట్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టి నష్టపోయినట్లు నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా గతంలో జూబ్లీహిల్స్, చందానగర్ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని డీసీపీ శిరీష వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కొత్తూరు సీఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా కథా సాహిత్యంపై పరిశోధనకు డాక్టరేట్ పొందిన బి. శోభాదేవి

**హన్మకొండ, 21 మే 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగ పరిశోధకురాలు బి. శోభాదేవికి డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. నల్లగొండ జిల్లా కథా సాహిత్యం అనే అంశంపై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు. భీమారంకు చెందిన డాక్టర్ బి. శోభాదేవి ప్రస్తుతం కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ బి. శోభాదేవిని అభినందించారు.

## హెరిటేజ్ సైట్, టూరిస్ట్ ప్లేస్ పోటీలకు ఆహ్వానం

**జూన్ 12లోపు ఫోటోలు, వీడియోలు పంపాలి : కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, మే 21 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాల ప్రాచుర్యం కోసం అన్ హిస్టరీ ఆఫ్ హెరిటేజ్ సైట్ / టూరిస్ట్ ప్లేస్ కాంపిటీషన్ - 2026 నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ప్రజలు వరంగల్ జిల్లాలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించి జియో ట్యాగ్ చేసిన సెల్ఫీలు లేదా ఫోటోలను పంపాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో కలిసి హెరిటేజ్ ప్రదేశాలను సందర్శించి రూపొందించిన వీడియోలను కూడా పంపవచ్చని పేర్కొన్నారు. ఉత్తమ వీడియోలకు నగదు బహుమతులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.15 వేల, ద్వితీయ బహుమతిగా రూ.10 వేల, తృతీయ బహుమతిగా రూ.5 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు తాము సందర్శించిన చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై ఆకర్షణీయమైన వీడియోలు రూపొందించి విస్తృత ప్రచారం చేయాలని కోరారు. వరల్డ్ టూరిజం డే సందర్భంగా ఉత్తమ ఇన్‌ఫ్లుయెన్సర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను జూన్ 12, 2026లోపు 9290010949 లేదా 7995503018 వాట్సాప్ నంబర్లకు పంపించాలని సూచించారు. పూర్తి మార్గదర్శకాల కోసం కూడా ఇదే నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## ఆసియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన కృష్ణవేణికి కేయూ ఆర్థిక సహాయం



**హన్మకొండ, 21 మే 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని మాచర్ల కృష్ణవేణి జూన్ 2 నుండి 5 వరకు మలేసియాలోని కౌలాలంపూర్‌లో నిర్వహించనున్న ద్వితీయ ఆసియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆమెకు కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య, డిసేబుల్డ్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ. రాజు పాల్గొని మాచర్ల కృష్ణవేణిని అభినందించారు. అలాగే విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పరకాలలో ఇన్‌స్పెక్టర్ కాంతికుమార్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం



**వరంగల్ జిల్లా/పరకాల, 21మే 2026 (జై భీమ్ న్యూస్)**

పరకాల పట్టణంలోని ఇండియన్ గ్యాస్ గోదాం వెనుక ఉన్న పంట పొలాల్లో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగి స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు వరి గడ్డి, ముక్కజొన్న పంట అవశేషాలకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ కాంతికుమార్ వెంటనే తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో మంటలు వ్యాపించడంతో ఎండిన గడ్డి, చెట్లు, పైపులు, బట్ట పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు సమీపంలోని మామిడి తోటల వరకు వ్యాపించే ప్రమాదం నెలకొనగా, ఇన్‌స్పెక్టర్ కాంతికుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి భారీ ప్రమాదాన్ని నివారించారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అనంతరం మంటలు అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పంట అవశేషాలను కాల్చకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయం చేస్తే సహించం: రేవంత్ రెడ్డి

**రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన రేవంత్ రెడ్డి**
**స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికింది రాజీవ్ అని కితాబు**
**సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మహిళా రిజర్వేషన్ల ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని, తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లుకు ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. ఈ దేశంలో స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లకు నాంది పలికిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితోనే పార్లమెంట్, అసెంబ్లీలలోనూ మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలన్నారు. భారతదేశానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెలికాం విప్లవాన్ని పరిచయం చేసి ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని రేవంత్ కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకృత విధానాలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. తెలంగాణ ప్రాంతానికి, గాంధీ కుటుంబానికి మధ్య దశాబ్దాల కాలంగా ఒక అవినాభావ సంబంధం ఉందని, అది కేవలం రాజకీయ బంధం మాత్రమే కాదని.. కుటుంబ సంబంధాల కంటే ఎంతో పవిత్రమైనదని ఆయన వ్యాఖ్యానించారు. కోట్లాది మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి, సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేతమైన చారిత్రాత్మక నిర్ణయంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ గడ్డపై తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఇక్కడి ప్రజలు గాంధీ కుటుంబం చేసిన త్యాగాన్ని, సహాయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ప్రజా ప్రభుత్వం పూర్తిగా రాజీవ్ గాంధీ ఆశయాలు, స్ఫూర్తితోనే ప్రజాక్షేమం కోసం ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

## ఐనవోలులో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండల కేంద్రంలో మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులుర్పించారు.కాంగ్రెస్ మండల నాయకులు బొమ్మినేని రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు,దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు అవకాశాలు కల్పించడం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అయినవోలు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలెపల్లి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. దేశ ఐక్యత, సమగ్రాభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.కార్యక్రమంలో నందనం గ్రామ సర్పంచ్ జెట్టబోయిన రాజు, వనమాలకనపర్తి సర్పంచ్ ఎల్ల స్వామి,పెరుమండ్లగూడెం గ్రామ సర్పంచ్ దుప్పెల్లి రాకేష్,ముల్కల గూడెం గ్రామ సర్పంచ్ నల్లబోతుల రాధిక లింగరాజు, పెరుమల్లగూడెం ఉపసర్పంచ్ అనిల్,వనమాల కనపర్తి ఉపసర్పంచ్ నోముల కుమార్,కక్కిరాలపల్లి గ్రామ వార్డు మెంబర్ మార్నేని లక్ష్మణ్ రావు, ఆరూరి అశోక్,యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుజరాత్ దెబ్బకు చెన్నై కథ సమాప్తం

**ఐపీఎల్-2026 నుంచి సీఎస్కే ఔట్**
**చెన్నైపై 89 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం**
**ఈ ఓటమితో ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన సీఎస్‌కే**
**గిల్, సాయి సుదర్శన్, బట్లర్ అర్ధశతకాలతో గుజరాత్ భారీ స్కోరు**
**లక్ష్య ఛేదనలో 140 పరుగులకే కుప్పకూలిన చెన్నై సూపర్ కింగ్స్**
**బౌలింగ్‌లో సిరాజ్, రబాడ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో చెలరేగారు**

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్రస్థానం ముగిసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలై ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్‌లో టాప్-2 స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 64), సాయి సుదర్శన్ (53 బంతుల్లో 84) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన జాస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. 230 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ ఆది నుంచే తడబడింది. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంసన్ డకౌట్ అయ్యాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (16) మెరుపులు తాత్కాలికమే అయ్యాయి. మహమ్మద్ సిరాజ్ తన తొలి ఓవర్లలోనే కీలక వికెట్లు పడగొట్టి చెన్నైని కోలుకోలేని దెబ్బ తీశాడు. శివమ్ దూబే (17 బంతుల్లో 47) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో చెన్నై 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. గుజరాత్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ తలా మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

## మెదక్ జిల్లాలో కంటైనర్‌లో మంటలు.. కొత్త కార్లు దగ్ధం

**కంటైనర్‌లోని ఎనిమిది కార్లు దగ్ధం**
**తూప్రాన్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై కంటైనర్ కు మంటలు**
**జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం**

**మెదక్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో కంటైనర్‌లో మంటలు చెలరేగి కొత్త కార్లు దగ్ధమయ్యాయి. 8 కొత్త కార్లతో కూడిన కంటైనర్ కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళుతోంది. తూప్రాన్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై అకస్మాత్తుగా మంటలు వచ్చి కంటైనర్ కాలిపోయింది. ఈ ఘటనలో అందులోని పది కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. కంటైనర్ దగ్ధం కావడం చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. కానీ అప్పటికే కంటైనర్, కార్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా ఈ జాతీయ రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

## కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం.. పోటెత్తిన భక్తులు

**తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు**
**12 రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలు**
**గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమం ఇది**
**భక్తుల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**



**భూపాలపల్లి, జై భీమ్ న్యూస్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ఈ రోజు ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి మఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 5:43 గంటలకు ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పవిత్ర స్నానం చేశారు. తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న ఈ పుష్కరాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రమే కాళేశ్వరం. దేశంలో ప్రయాగ్‌రాజ్ తర్వాత ఇలాంటి త్రివేణి సంగమం ఉన్న రెండో ప్రదేశం ఇదే. ఇక్కడ స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోయి, పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ 12 రోజుల పుష్కరాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 20 నుంచి 30 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, దేవాదాయ శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

## భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే అరెస్ట్ చేశారు: సీఎం రేవంత్ రెడ్డి

**అప్పా జంక్షన్ తనిఖీల్లో బండి భగీరథ్ అరెస్ట్**
**లొంగిపోయారనే ప్రచారాన్ని ఖండించిన రేవంత్**
**పోలీసుల దర్యాప్తు సమాచారానికే ముఖ్యమంత్రి మద్దతు**
**మైనర్ బాలిక అంశంపై రాజకీయాలను తప్పుబట్టిన సీఎం**
**కేటీఆర్ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసులను ఇంటికి పిలిచి అప్పగించాల్సిందని అభిప్రాయపడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని నిలదీశారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు.

## రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..

**ఎన్నాళ్లీ మొద్దు నిద్ర అని ప్రశ్న!**
**పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ రేవంత్ కు కేటీఆర్ లేఖ**
**కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్న కేటీఆర్**
**10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన**
**గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచి డిపాజిట్ వసూలు చేస్తున్నారని మండిపాటు**
**రైతు ద్రోహిగా రేవంత్ మిగిలిపోతారని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా రైతులపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని, అడపాదడపా కొనే చోట కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే రూ. 50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితి తేవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ నీపేర్కొన్నారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్లు కూడా సమకూర్చలేకపోతోందని, దీనివల్ల రైతులు కళ్లముందే ధాన్యం కొట్టుకుపోతుంటే నిస్సహాయ స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పంటలకు బోనస్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని, కనీసం మద్దతు ధరకు కొనుగోళ్లు కూడా చేయలేకపోతే 60 లక్షల మంది రైతులకు ముఖ్యమంత్రి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు, రాస్తారోకో జరగని రహదారి లేదన్న కేటీఆర్... ఇవాళ బూతులు తిడుతున్న రైతులే రేపు కాంగ్రెస్ సర్కారుకు వాతలు పెడతారని అన్నారు. అన్నదాతల చేతిలోనే ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ మొదలైందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, లేనిపక్షంలో చరిత్రలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ఒక 'రైతు ద్రోహి'గానే మిగిలిపోతారని హెచ్చరికలు చేశారు.






# కందిపప్పు ఎక్కువగా తింటున్నారా..?



మన రోజువారీ ఆహారంలో కందిపప్పు ముఖ్యమైన భాగం. కానీ ఇటీవల కల్తీ సమస్య పెరుగుతోంది. కేసరి పప్పు అనే విషపూరిత పదార్థాన్ని దీనిలో కలుపుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది అంటున్నారు. మన ఆహారంలో ప్రోటీన్ ప్రధానమైన మూలకం. దానిని అందించేవాటిలో పప్పులు ముఖ్యమైనవి. అందులోను కందిపప్పు మన భారతీయ ఆహారంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా సాంబార్, పప్పు కూరలు తయారీలో కందిపప్పును విరివిగా ఉపయోగిస్తారు. కానీ ప్రస్తుతం దీనిలో కల్తీ ఎక్కువవుతోందనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. కేసరి పప్పు అనే రసాయనాలతో కలిపిన విషపూరిత పప్పును కల్తీ చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరమని, దీని వల్ల తీవ్రమైన నరాల సమస్యలు, క్యాన్సర్ వంటి జబ్బులు వస్తాయని సూచిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో మార్కెట్లో లభిస్తున్న కందిపప్పులో కేసరి పప్పును కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ కేసరి పప్పు అసలు తినదగినది కాదు. ఇది కలుపు మొక్కల ద్వారా పెరిగే విషపూరిత పదార్థం. దీన్ని తినడం వల్ల ముఖ్యంగా నరాల వ్యవస్థ దెబ్బతింటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఎక్కువగా తింటే కాళ్లు, చేతులు నెమ్మదిగా పని చేయకపోవడం, నడవలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి. దీన్ని లాథిరిజం అని అంటారు. దీని ప్రభావం శాశ్వతంగా ఉండే ప్రమాదం ఉంది. అంతేకాకుండా వ్యాపారులు ఈ కల్తీని గుర్తించకుండా ఉండేందుకు టార్ట్రాజిన్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది ఒక రకమైన ఆహార రంగు పదార్థం. దీని వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీని ప్రభావం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. కేసరి పప్పు కందిపప్పును పోలి ఉంటుంది. అయితే దీని ఆకారం కొద్దిగా చతురస్రాకారంలో ఉంటుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ధరలో లభించే ఈ పప్పును అసలు కందిపప్పులో కలిపి అమ్ముతున్నారు. దీని వల్ల సామాన్య వినియోగదారులకు అసలు పప్పు, కల్తీ పప్పు మధ్య తేడా గుర్తించడం కష్టం అవుతోంది. ఇంట్లోనే ఈ పప్పులో కల్తీ ఉందో లేదో సులభంగా పరీక్షించుకోవచ్చు. దాని కోసం 10 గ్రాముల పప్పులో 25 మి.లీ నీరు పోసి, 5 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం వేసి చిన్న మంటపై వేడి చేయాలి. ఈ ప్రక్రియలో నీటి రంగు మారితే ఆ పప్పులో కల్తీ ఉందని అర్థం. అదనంగా సహజమైన కందిపప్పు నునుపుగా, గుండ్రంగా ఉంటుంది. అయితే కల్తీ కేసరి పప్పు త్రికోణాకారంలో ఉండే అవకాశం ఉంది. ప్రతిరోజు మనం తినే ఆహార పదార్థాలు మానవ ఆరోగ్యానికి ముప్పు కలిగించకూడదు. కాబట్టి నాణ్యమైన పప్పును మాత్రమే కొనుగోలు చేయాలి. గుర్తింపు పొందిన బ్రాండ్‌లను ఉపయోగించడం ఉత్తమం. మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాణ్యత లేని పప్పులను కొనడం మానుకోవాలి.

# పుచ్చకాయలోని తెల్లని భాగం పొరబాటున ఎప్పుడైనా తినేశారా?

చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. వేసవిలో ప్రకృతి ప్రసాధించిన అద్భుత వరం పుచ్చకాయ. పండ్ల రారాజు మామిడి, లిచీ, పుచ్చకాయ వంటి అన్ని రకాల పండ్లు ఈ కాలంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు మించిన ప్రత్యామ్నయం మరొకటి లేదు. అయితే మనలో చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. ఇందులో సిట్రుల్లైన్ అనే ఒక రకమైన అనావశ్యక అమైనో ఆమ్లం ఉంటుంది. పుచ్చకాయలోని తెల్లని భాగం తినడం వల్ల శరీరంలో దీని స్థాయి పెరుగుతుంది. సిట్రులిన్ మన రక్త నాళాలను విస్తరిస్తుంది. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం సిట్రుల్లైన్ కండరాలకు ఆక్సిజన్ అందిస్తుంది. ఫలితంగా పనితీరు పెరుగుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ హైపర్‌టెన్షన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. పుచ్చకాయలోని తెలుపు, ఇతర భాగాలు పెద్దలలో అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయనే సంగతి తెలిసిన విషయమే. ఫైబర్ ప్రేగు కదలికలకు సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు త్వరగా కడుపు నింపుతాయి. ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.



# డయాబెటిస్‌తో బాధపడుతున్నారా?

డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఈ రోజుల్లో హై బ్లడ్ షుగర్ లేదా డయాబెటిస్ సమస్య చాలా మంది వ్యక్తులలో సాధారణంగా కనిపిస్తోంది. ఈ వ్యాధికి పూర్తి స్థాయి నివారణ లేనప్పటికీ దీనిని నియంత్రణలో ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ప్రజలు అనేక రకాల ఇంటి చిట్కాలను పాటిస్తారు. మందులను ఉపయోగిస్తారు. అయితే, ఉల్లిపాయలు తినడం కూడా డయాబెటిస్ రోగులకు చాలా మేలు చేస్తుందని తెలుసుకోవడం ఆసక్తికరం. ఉల్లిపాయల్లో ఫోలేట్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలను వంటలో వేసుకుని తినవచ్చు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం ఇంకా ఎక్కువ ప్రయోజనకరం. ఉల్లిపాయల్లో ఉండే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ గుణం రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని తినడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచవచ్చు. ఉల్లిపాయల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు డయాబెటిస్ రోగులకు ఎంతో మంచివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచవు. అందుకే పచ్చి ఉల్లిపాయలను నిరభ్యంతరంగా తినవచ్చు. డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఉల్లిపాయల్లోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో, బరువు తగ్గడంలో కూడా ఉల్లిపాయలు ఉపయోగపడతాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ రోగులకు బరువును నియంత్రణలో ఉంచడం చాలా ముఖ్యం. ఉల్లిపాయలను కూరల్లో




కలిపి తినవచ్చు లేదా సలాడ్‌గా కూడా సేవించవచ్చు. డయాబెటిస్ రోగులకు ఉల్లిపాయలు ఒక సహజమైన, సులభమైన ఆహార ఎంపిక. దీనిని రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని డైట్‌లో చేర్చే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా డయాబెటిస్‌తో ఇబ్బంది పడేవారు వైద్యులను సంప్రదించాలి.

## ఈ పండ్లు తింటే జీవితంలో గుండె జబ్బులు రావ్..




నేటి కాలంలో ఆరోగ్యంగా ఉండటం పెను సవాలే. మారిన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరినీ హడలెత్తిస్తున్న ప్రధాన సమస్య గుండె సమస్యలు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దీని బారీన పడుతున్నారు. నేటి కాలంలో గుండె జబ్బులు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది యువకులు, చిన్న పిల్లలు గుండెపోటుతో మృతి చెందారు. దీనికంతటికీ కారణం మనం తినే ఆహారాలు, మన తప్పుడు దిన చర్యలే కారణం అంటున్నారు నిపుణులు. అందువల్ల, గుండె జబ్బులను ఎలా నివారించాలో నిపుణులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదం చేసే 5 రకాల పండ్లు ఇవే. బ్లూబెర్రీస్‌లో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్తపోటును తగ్గిస్తుంది. యాపిల్స్ ఫైబర్ కు మంచి మూలం. గుండెకు మేలు చేసే ఆమ్లాలు ఇందులో అధికంగా ఉంటాయి. పెక్టిన్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది. ప్రతిరోజూ ఒక ఆపిల్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దానిమ్మ గుండె ఆరోగ్యానికి మేలు చేసే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. దీన్ని తినడం రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె సామర్థ్యం పెరుగుతుంది. రక్తపోటు, పిత్త సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది. అవకాడోలు గుండెకు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉంటాయి. ఇందులో పొటాషియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇందులో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడో జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది.

## ఈ సమస్యలు ఉన్నవారు ఖర్జూర పండ్లు తినకూడదు..!



ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో ఖర్జూరాన్ని చేర్చుకోవాలని సలహా ఇస్తారు. నిపుణుల ప్రకారం.. సరైన మోతాదులో సరైన విధానంలో ఈ డ్రై ఫ్రూట్‌ను ఆహార ప్రణాళికలో చేర్చుకుంటే మొత్తం ఆరోగ్యం చాలా వరకు మెరుగుపడుతుంది. అయితే, ఖర్జూరం తినడం వల్ల కొందరి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కూడా పడవచ్చు. అందువల్ల కొన్ని సందర్భాల్లో ఈ వారు ఖర్జూరాన్ని ఆహారంలో తీసుకోకుండా ఉండాలి. ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. అలాగే, అధిక మోతాదులో ఖర్జూరం తీసుకోవడం వల్ల మీ బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఊబకాయం నుండి విముక్తి పొందాలనుకుంటే ఖర్జూరం తినడం మానుకోవడం మంచిది. డయేరియా సమస్యతో బాధపడుతున్న రోగులు కూడా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకుండా ఉండాలి. ఖర్జూరంలో ఉండే కొన్ని పదార్థాలు డయేరియా సమస్యను మరింత పెంచే పని చేస్తాయి. అంతేకాకుండా అధిక మోతాదులో ఖర్జూరం తినడం వల్ల మలబద్ధకం సమస్య కూడా పెరగవచ్చు. గర్భం దాల్చిన సమయంలో ఆహారం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఇలాంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు కూడా ఎక్కువగా ఖర్జూరం తినకూడదు. వైద్యుడి సలహా లేకుండా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకపోవడమే మంచిది. అంతేకాకుండా ఖర్జూరం తినడం వల్ల అలర్జీ ఉంటే ఈ డ్రై ఫ్రూట్‌ను మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. దీన్ని సమతుల్యంగా తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరంగా చూద్దాం!


## రాత్రి భోజనంలో అన్నం తింటున్నారా?



దాదాపు ప్రతి ఇంటిలోనూ అన్నం ప్రధాన ఆహారం. చాలా మంది మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అన్నం తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రిపూట అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదా? అనే సందేహం పలువురికి ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బియ్యం మన శరీరానికి శక్తిని, అవసరమైన పోషకాలను అందిస్తున్నప్పటికీ రాత్రిపూట ఆలస్యంగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. బియ్యంలో సాధారణంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. అయితే రాత్రిపూట మన శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు పేరుకుపోతాయి. అంతేకాకుండా నిద్రలో శరీర జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అదనపు కేలరీలను బర్న్ చేయడం కష్టమవుతుంది. ఇది కాలక్రమేణా బరువు పెరగడానికి దారితీస్తుంది. తెల్ల బియ్యం అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. దీని అర్థం ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి రాత్రి భోజనంలో అన్నం తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. కాలక్రమేణా ఇది టైప్ 2 డయాబెటిస్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మంచి ఆహారాన్ని ఎంచుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మంచి మార్గం. చాలా మందికి రాత్రి భోజనంలో అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా బియ్యంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో జీర్ణక్రియ సరిగా లేని వారికి, రాత్రి భోజనానికి అన్నం తినడం వల్ల ఆమ్లత్వం, ఆపాన వాయువు ఏర్పడతాయి. ఇది మీ నిద్రను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. బియ్యంలో నిద్రను ప్రోత్సహించే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఇది శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రాత్రిపూట క్రమం తప్పకుండా అన్నం తినడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుంది. తెల్ల బియ్యంలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. బియ్యం బదులుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవచ్చు. రాత్రిపూట రోటీ లేదా చపాతీ, రాగి, కూరగాయల సూప్ వంటి ఆహారాలు తినడానికి ప్రయత్నించాలి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

## పొలిటికల్ ఎంట్రీపై తిరుగులేని క్లారిటీ ఇచ్చిన రామ్ చరణ్



**రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేసిన రామ్ చరణ్**

**చిత్ర పరిశ్రమలో నంబర్ వన్ కావడమే తన లక్ష్యమని వెల్లడి**

**'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని వ్యాఖ్య**


**డూప్ లేకుండా స్టంట్స్ చేయడం తనకిష్టమని, తండ్రే స్ఫూర్తి అని వెల్లడి**


**బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, సినిమా రంగంలో అగ్రస్థానానికి చేరడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు."అభిమానులు మిమ్మల్ని సీఎంగా చూడాలనుకుంటున్నారు, మీరు రాజకీయాల్లోకి వస్తారా?" అన్న ప్రశ్నకు చరణ్ బదులిస్తూ.. "రెండు పడవలపై ప్రయాణం చేయాలనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నటనపైనే ఉంది... నటనా రంగంలో మేటిగా నిలవడంపైనే నా దృష్టంతా!" అని అన్నారు.తన కొత్త సినిమా 'పెద్ది' గురించి మాట్లాడుతూ, ఇది తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో, తన అస్తిత్వాన్ని వెతుక్కునే 'పెద్ది' అనే యువకుడిగా కనిపిస్తానని వివరించారు. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడ్డానని చెప్పారు. క్రీడా నేపథ్య డ్రామాగా వస్తున్న ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.రిస్కీ షాట్‌లలో డూప్‌ల సహాయం లేకుండా నటించడానికే ఇష్టపడతానని, తన తండ్రి చిరంజీవి 71 ఏళ్ల వయసులో కూడా స్టంట్స్ చేస్తున్నారని, అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని రామ్ చరణ్ పేర్కొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'పెద్ది' చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## 30 ఏళ్ల రివర్స్ సీన్.. తమ్ముడి క్లాప్‌పై చిరంజీవి ఎమోషనల్ ట్వీట్!

మెగాస్టార్ చిరంజీవి 158వ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తన అన్నయ్య చిరంజీవిపై తీసిన ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్లాప్ బోర్డ్ వెనుక ఉన్న ఒక అద్భుతమైన 30 ఏళ్ల నాటి విషయాన్ని గుర్తుచేస్తూ చిరంజీవి ఎక్స్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు."ఈ రోజు కల్యాణ్ బాబుకి, నాకు మధ్యలో క్లాప్ కనిపిస్తుంటే... 30 సంవత్సరాల క్రితం ఇదే సీన్ రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకు వస్తోంది ... 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ రోజు డిప్యూటీ సీఎం హోదాలో టైమ్ తీసుకుని వచ్చి, నా 158వ సినిమా ముహూర్తంలో పాల్గొని, క్లాప్ ఇచ్చి యూనిట్ సభ్యులందరినీ ఆనందపరిచినందుకు థాంక్యూ" అని చిరంజీవి భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.ఫ్లాష్‌బ్యాక్: సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, పవన్ కల్యాణ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి పరిచయమైన క్లాసిక్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' (1996). ఆరోజు ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు అన్నయ్యగా చిరంజీవి ముందుండి తమ్ముడు పవన్ కల్యాణ్‌కు క్లాప్ కొట్టి వెండితెరకు పరిచయం చేశారు. ఇవాళ అదే సీన్ రివర్స్ అయింది. ఆరోజు అన్నయ్య క్లాప్ కొట్టి తమ్ముడిని ఆశీర్వదించారు. ఈరోజు తమ్ముడు ఏకంగా ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హోదాలో వచ్చి.. అన్నయ్య 158వ సినిమాకు క్లాప్ కొట్టారు. మూడు దశాబ్దాలు గడిచినా, మెగా బ్రదర్స్ మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే ఉందనడానికి ఈ క్లాప్ బోర్డ్ విజువల్ ఒక పెద్ద నిదర్శనం.మరోవైపు, ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మలయాళ యువ నటి అనశ్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది.





# విజయాన్ని శాసించేది ఆ మూడు మాత్రమే

నెపొటిజం గురించి చాలామంది స్టార్‌కిడ్స్ చాలా సందర్భాల్లో మాట్లాడారు. తాజాగా మహేశ్ మంజ్రేకర్ ముద్దుల తనయ సాయి మంజ్రేకర్ కూడా ఈ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. సినీ పరిశ్రమలో నటవారసత్వం అనే అంశంపై ఇటీవల ఆమె మాట్లాడుతూ 'ఇంటిపేరనేది బలమైన కెరీర్‌కి గ్యారెంటీ కార్డు కాదు. అది కేవలం ప్రారంభంలో పరిచయాలకూ, తొలి సినిమా అవకాశానికి మాత్రమే సహాయపడుతుంది. జనానికి కనెక్ట్ కానప్పుడు, ఎంతటి సూపర్‌స్టార్ వారసులైనా తలదించుకొని వెనక్కెళ్లిపోవాల్సిందే. అందుకే 'మంజ్రేకర్' అనే కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, కేవలం నా కష్టం, అంకితభావంతో ఇండస్ట్రీలో నిలబడాలనుకుంటున్నా. హార్డ్‌వర్క్, క్రమశిక్షణ, పట్టుదల.. ఈ మూడు మాత్రమే విజయాన్ని శాసిస్తాయి' అని సాయి మంజ్రేకర్ పేర్కొన్నది. 'మేజర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన సాయి మంజ్రేకర్.. ప్రస్తుతం తెలుగు చారిత్రాత్మక పానిండియా చిత్రం 'ఇండియా హౌస్'లో కథానాయికగా నటిస్తున్నది.